

ప్రాజెక్టు ఇక భద్రం



జూరాల ప్రాజెక్టు దిగువన హై లెవల్ రోడ్డు బ్రిడ్జి నిర్మించబోయే ప్రాంతం

- జూరాల క్రస్ట్‌గేట్ల దిగువన రూ.121.92 కోట్లతో హై లెవల్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం
- ఇటు నందిమల్ల.. అటు రేవులపల్లి మధ్య కిలోమీటర్ పొడవున..
- దాంతో పాటే అప్రోచ్ రోడ్డు, అవసరమైన కల్వర్టులు, లింక్ రోడ్లు కూడా..
- పరిపాలన అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- 2012లో మొదటి ప్రతిపాదనలు.. నిధులు రావడానికి 13 ఏళ్ల సమయం



జూరాల ప్రాజెక్టు పైనుంచి వెళ్తున్న వాహనాలు(ఫైల్)

మహబూబ్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మెట్ట ప్రాంతాలకు సాగునీరు, ఉమ్మడి పాలమూరుకు తాగునీరు.. విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో నిర్మించిన జూరాల ప్రాజెక్టు కొద్దికాలంగా భద్రత ముప్పు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.. ప్రాజెక్టు నిర్మించినప్పుడు కట్టపై నుంచి వాహనాలు ఇరువైపులా తిరగడాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పటికీ, నిత్యం రాకపోకలు పెరుగుతుండటంతో ప్రాజెక్టు భద్రతకు ఇబ్బందిగా మారింది. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా జూరాలకు దిగువన హై లెవల్ బ్రిడ్జిని నిర్మించాలనే ప్రతిపాదనలు దాదాపు 13 ఏళ్లుగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు నిధుల మంజూరుకు నోచుకోలేదు. ఇటీవల ప్రాజెక్టు మరమ్మతుల సమయంలో రోప్‌లు తెగిపోవడం, గ్యాంటీ క్రేన్ మరమ్మతుకు గురికావడంతో అది రాజకీయ దుమారంగా మారింది. ఆ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గత శనివారం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, అధికారులు హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం ప్రాతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆ ప్రతిపాదనలకు వెంటనే ఓకే చెప్పి, నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. అదే సందర్భంలో కేవలం బ్రిడ్జితో సరిపెట్టకుండా రోడ్ కం బ్యారేజీ ఏర్పాటును పరిశీలించాలని కోరగా.. సర్వే చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అయితే రోడ్ కం బ్యారేజీ అంశాన్ని ప్రస్తావించకుండానే రాష్ట్ర ప్రభుత్వం జూరాల దిగువన రూ.121.92 కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి

(మిగతా 6లో..)

13 ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు..

జూరాల ప్రాజెక్టు భద్రతపై 2012లో ప్రాజెక్టుల నిపుణులు ఎస్.ఈశ్వరప్ప, కె.సత్యనారాయణలతో తనిఖీలు నిర్వహించారు. వారు కట్టపై నుంచి భారీ వాహనాల రాకపోకలను నిషేధించి, కట్ట దిగువన హై లెవల్ రోడ్డు బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. అధికారులు సర్వే నిర్వహించి.. డిజైన్ల కోసం సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ హైదరాబాద్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే హైలెవల్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం కిలోమీటర్‌పైన చేపట్టబోతున్న పక్షంలో ఆర్‌అండ్‌బీ ద్వారా పనులు చేపట్టాలని సూచించింది. ఆర్‌అండ్‌బీ అధికారులు నివేదిక రూపొందించి, రూ.120 కోట్లను జమ చేయాలని నీటిపారుదల విభాగాన్ని అభ్యర్థించారు. ఆ తర్వాత కూడా ఆలస్యమైంది. తర్వాత 2018లో తుమ్మిళ్ల ఎత్తిపోల పథకం వద్ద అప్పటి ఇరిగేషన్ ఈఎన్‌సీ.. ఆర్‌అండ్‌బీకి నిధులు బదిలీ చేయడానికి బదులుగా సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ద్వారానే పూర్తి సర్వే, మ్యాపింగ్, డిజైన్లు సిద్ధం చేయాలని మౌఖికంగా ఆదేశించారు. సీడీవో నుంచి దానికి సంబంధించిన డిజైన్లు 2021లో రూపొందించి పంపించారు. మార్చి 16, 2022లో డ్యామ్ సేఫ్టీ ప్యానెల్ కూడా పరిశీలించి ప్రాజెక్టుపై నుంచి రాకపోకలను నిషేధించి.. దిగువన బ్రిడ్జి నిర్మాణం చేయాలని సూచించింది. అయినా నిధుల విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇరిగేషన్ నుంచి ఆర్‌అండ్‌బీకి, ఆర్‌అండ్‌బీ నుంచి ఇరిగేషన్‌కు ఇలా ప్రతిపాదనల ఫైల్ కదిలింది కానీ బ్రిడ్జి మంజూరు కాలేదు. తాజాగా దాదాపు అదే డిజైన్లతో ఆర్‌అండ్‌బీ ద్వారా పనులు చేపట్టడానికి ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. స్వల్ప మార్పులు చేర్పులు మినహా దాదాపు పాత డిజైన్‌లాగానే డీపీఆర్ ఉండనుంది.

సృజనాత్మకత పెంపొందేలా
విద్యాబోధన సాగించాలి

- స్టేట్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్ రెడ్డి



మాట్లాడుతున్న సీతాదయాకర్ రెడ్డి

బిజినేపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందేలా విద్యాబోధన సాగించాలని స్టేట్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం కమిషన్ సభ్యులతో కలిసి పరిశీలించారు. బాలికలకు అందుతున్న పౌష్టి కాహారం, విద్యాబోధన, మౌలిక వసతుల కల్పనను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. లింగవివక్ష లేకుండా మగవారితో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. పాఠశాల విద్యా భవిష్యత్తుకు పునాదిగా మలుచుకోవాలన్నారు. సమాజంలోని మంచి చెడులపై అవగాహన కల్గి ఉండి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.

అలాగే ఉన్నత పాఠశాలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని త్వరలో ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ప్రహరీ, సరిపడ బోధన సిబ్బంది ఉండటంతో పాటు గతేడాది వందశాతం రిజల్ట్స్‌తో పాటు ఐదు వందలకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అలాగే ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట కమిషన్ సభ్యులు వేదన్‌కుమార్, ప్రేమలత అగర్వాల్, అపర్ణ, సరిత, వందన, లక్ష్మణ్ గౌడ్, డీఈవో రమేష్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ చిక్కుడు రవికుమార్, ఎంఈవో రఘునాథ్ శర్మ, జీహెచ్‌ఎం నివేదిత తదితరులు ఉన్నారు.

విద్యతోనే విద్యార్థులు
ఉన్నత శిఖరాలకు...

- కలెక్టర్ బదావత్ సంతోష్

తాడూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి చదువులో ఉన్నతంగా రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకుంటారని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు గణితం బోధించారు. వంటశాల వద్దకు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యనభ్యసించే ప్రతీ విద్యార్థి కచ్చితమైన జీవిత లక్ష్యంతో ముందుకెళ్లినప్పుడే ఎంతటి విజయాలైనా సాధ్యమవుతాయన్నారు. ఈ ఏడాది జిల్లాను ఉన్నత స్థానంలో నిలిచేలా ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు హాజరు శాతంతో పాటు పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి వెళ్లారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



సిర్సవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కొనసాగుతున్న వరద



జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

- జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు ఎగువ నుంచి నీటి రాక
- ఐదు గేట్ల ద్వారా దిగువకు విడుదల

6

నిల్చోనే నిరీక్షణ!



వనపర్తి గాంధీ చౌక్ బస్‌స్టాప్‌లో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

బస్ స్టాప్‌లలో షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిత్యం బస్సుల కోసం ఎదురుచూస్తున్న వారందరూ రోడ్లపైనే నిల్చోనే నిరీక్షించాల్సిన దుస్థితి. వనపర్తి జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయంతో పాటు దవాఖానాలు, విద్యా సంస్థలు, వ్యాపారాల నిమిత్తం వచ్చే వారి పరిస్థితి ఇది. పట్టణంలోని రాజీవ్‌చౌరస్తా, గాంధీ చౌక్, పాత బస్టాండ్‌లలో ఇది నిత్యకృత్యంగా కనిపిస్తున్న పరిస్థితి.

- వనపర్తి రూరల్, ఆంధ్రజ్యోతి

రిజర్వేషన్లపై చర్చల జోరు

- హైకోర్టు ఆదేశాలతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశావహుల ఎదురుచూపులు
- రంగం సిద్ధం చేసుకుంటున్న ప్రధాన పార్టీలు
- ఇప్పటికే నియోజకవర్గ స్థాయి సమావేశాలు పూర్తి

7

వర్షంలోనే ఎఫ్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన



వర్షంలోనే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన విద్యార్థులు

వనపర్తి విద్యావిభాగం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎఫ్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన వర్షంలోనే కొనసాగింది. సీట్ల కేటాయింపునకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలనకు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కళాశాల సిబ్బంది కుర్చీలు, టెంట్లు తాగునీరు ఏర్పాటు చేయలేదని తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్‌కు మొత్తం 234 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగన్ తెలిపారు.

వెంటాడుతున్న..
ప్లాస్టిక్ భూతం

- ప్రభుత్వం నిషేధించినా ఆగని ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- ప్రత్యామ్నాయాలపై అవగాహన శూన్యం
- మొక్కుబడి తనిఖీలతో నెరవేరని లక్ష్యం
- నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం

6

ప్లాస్టిక్ భూతం.. ప్రజలను నిత్యం వెంటాడుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం విచ్చలవిడిగా కొనసాగుతోంది. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలు, మునిసిపాలిటీలు, పాలమూరు నగరంలో కిరాణం, పండ్ల దుకాణాలతో పాటు దాదాపు అన్ని షాపుల్లో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న కవర్లు, క్యారీ బ్యాగులను వినియోగిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్లాస్టిక్ కవర్ల నిషేధం సక్రమంగా అమలు కావడం లేదు. మునిసిపాలిటీల్లో సిబ్బంది రోజూ సేకరించే చెత్తలో సగానికి పైగా ఆ కవర్లే ఉండటం గమనార్హం. నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్





మహబూబ్‌నగర్ నగరంలోని ఓ దుకాణంలో భారీగా పట్టుబడ్డ ప్లాస్టిక్ కవర్ల సంచులు(ఫైల్)

ఈవ్‌టీజింగ్‌పై కఠిన చర్యలు

- మహిళలు, బాలికలకు భరోసా కల్పించాలి
- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) :ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో షీ టీం, భరోసా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మొదట 2025 జనవరి 1 నుంచి నమోదైన కేసుల పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ... సహాయం కోసం వచ్చే మహిళలు, బాలికల పట్ల గోప్యత పాటించాలని సూచించారు. ప్రధానంగా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్కూళ్లకు వెళ్లే పిల్లల మానసిక పరిస్థితి, వారి యొక్క అలవాట్లు బాగోగులు తెలుసుకోవాలని సూచించారు. మహిళలకు, బాలికలకు షీ టీం ఉందనే భరోసా కల్పించాలని తెలిపారు.

ప్రధానంగా పట్టణంలో పార్కులు, కళాశాలల వద్ద ప్రత్యేకంగా నిఘా ఉంచి ఆకతాయిలను పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. కౌన్సెలింగ్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ కృష్ణయ్య, ఆత్మకూరు సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్,షీ టీం ఎస్‌ఐ అంజద్, భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విడువని వాన

- 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు



వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో కురుస్తున్న వర్షం



నాగర్‌కర్నూల్‌లో తెగిపడిన విద్యుత్ వైర్లను సరిచేస్తున్న దృశ్యం



వర్షంలో తడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

వనపర్తి/నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా వ్యాప్తంగా గత 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కు రుస్తున్నది. మంగళవారం రాత్రి భారీ వర్షం కురవగా బుధవారం తెల్లవారుజామున నుంచి ముసురు కురుస్తోంది.

● వర్షపాతం ఇలా..

వనపర్తి జిల్లా అంతటా 24 గంటలుగా వర్షం కురుస్తున్నది. అత్యధికంగా ఖిల్లాఘణపూర్ మండలంలో 24.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. పెద్దమందడిలో 20.4, వనపర్తిలో 16.5, మదనాపూర్‌లో 15.9, కొత్తకోటలో 15.5, రేవల్లిలో 14.2, ఏదులలో 12.8, గోపాల్‌పేటలో 11.9, ఆత్మకూరులో 11.3, అమరచింతలో 10.2, పాన్‌గల్‌లో 9.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యల్పంగా వీపనగండ్ల మండలంలో 0.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది.

నాగర్‌కర్నూల్‌లో..

జిల్లాలో అత్యధికంగా బిజినేపల్లి మండలంలో 25.6 మమిల్లీ మీటర్లు కురువగా పెంట్లవెల్లి మండలంలో అత్యల్పంగా 2.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అదేవిధంగా వంగూరు మండలంలో 25.2, తాడూరులో 24.0, తిమ్మాజిపేటలో 23.8, కల్వకుర్తిలో 21.8, ఉప్పునుంతల, పెద్దకొత్తపల్లి మండలాల్లో 16.4 మిల్లీ మీటర్లు, వెల్దండలో 12.6, తెలకపల్లిలో 12.2, కోడేరులో 11.8, నాగర్‌కర్నూల్‌లో 11.4 మీల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 7.4 నుంచి 9.2 మీల్లీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. కాగా, మంగళవారం రాత్రి కురిసిన గాలివానకు పట్టణంలోని రామాలయం వెళ్లే దారిలో జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల వెనకాల ఆవరణంలో భారీ చెట్టు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడింది. ఆ రాత్రంగా రాంనగర్‌కాలనీకి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో మునిసిపాలిటీ, విద్యుత్‌శాఖ సిబ్బంది సమన్వయంతో విరిగిన పడిన చెట్టును తొగించారు. కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం

- వనపర్తి జిల్లావాసులు ఇద్దరి మృతి, పలువురికి గాయాలు
- విహారయాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం

6

వివాహిత ఆత్మహత్య

- సంతానం కలగడం లేదని మనస్తాపం
- అయిజలో ఘటన

7

బ్యాంకు ఖాతాలో నుంచి
రూ. 64 వేలు మాయం

- పీఎం కిసాన్ పేరిట వాట్సాప్‌కు లింకు
- క్లిక్ చేయగానే నగదు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు

7

- గట్టు పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

వెంటాడుతున్న ప్లాస్టిక్ భూతం

- ప్రభుత్వం నిషేధించినా ఆగని వినియోగం
- ప్రత్యామ్నాయాలపై అవగాహన శూన్యం
- మొక్కుబడి తనిఖీలతో నెరవేరని లక్ష్యం
- నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం



వీధుల్లో కనిపిస్తున్న ప్లాస్టిక్



ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న జనం

మహబూబ్‌నగర్/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ భూతం ప్రజలను వదలకుండా వెంటాడుతూనే ఉంది. పర్యావరణానికి పెను ముప్పుగా మారుతోంది. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించినా, వినియోగం మాత్రం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. వినియోగాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు బుట్టదాఖలవుతూనే ఉన్నాయి. కట్టడి చేయలేక అధికారయంత్రాంగం చేతులెత్తేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. అధికారులు అడపా దడపా తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్నా, విక్రయదారులపై చర్యలు తీసుకుంటున్నా పెద్దగా ఫలితం ఉండటం లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

విచ్చలవిడిగా వినియోగం

మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని భూత్పూర్, జడ్చర్ల మునిసిపాలిటీల్లో 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం కలిగిన ప్లాస్టిక్‌తో పాటు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ స్పూన్లు, ఫోర్క్‌లు, ప్లేట్లు, గ్లాసుల వినియోగం విచ్చలవిడిగా కొనసాగుతూనే ఉంది. ఇదే విషయంపై నెల రోజుల క్రితం కార్పొరేషన్, మునిసిపాలిటీల అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇకపై ప్రతీ రోజు తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు రెండు, మూడు రోజులు తనిఖీలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రముఖ వ్యాపారవేత్త దుకాణంలో ఏకంగా 170 కిలోల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. నారాయణపేట మునిసిపాలిటీలో 10 కిలోల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి రూ. 10,500 జరిమానా విధించినట్లు మునిసిపల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ భరత్ తెలిపారు. తమ కార్యాలయంలో ప్లాస్టిక్ బాటిళ్లకు బదులుగా స్టీల్ బాటిళ్లను వినియోగిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ బోగేశ్వర్లు తెలిపారు. అయితే అడపా దడపా తనిఖీలతో పెద్దగా ప్రయోజనం ఉండదని, నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు చేపడితేనే ప్లాస్టిక్‌పై నిషేధం పక్కాగా అమలయ్యే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



ప్లాస్టిక్ బ్యాగుతో మహిళ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

మహబూబ్‌నగర్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం విచ్చల విడిగా కొనసాగుతూనే ఉంది. నారాయణపేట మునిసిపాలిటీలో ప్రతీ రోజు 6 టన్నుల వరకు ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి తదితర పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో కిరాణం, పండ్లు ఇతర దుకాణాల్లో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగులను విరివిగా ఉపయోగిస్తున్నారు. వనపర్తి జిల్లా కేంద్రంతో పాటు పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత మునిసిపాలిటీల్లో సిబ్బంది ప్రతీ రోజు సేకరించే చెత్తలో సగానికి పైగా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి.

మార్కెట్‌లో 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం గల కవర్లు కిలోకు రూ.170 నుంచి రూ. 180 వరకు విక్రయిస్తున్నారు. అదే మందం గల కవర్లు కిలోకు రూ.100 నుంచి రూ. 110కే విక్రయిస్తున్నారు. తక్కువ మందంగల కవర్లు రెండింతలు వస్తుండటంతో వ్యాపారులు ఎక్కువగా వాటినే వినియోగిస్తున్నారు. ముందుగా హైదరాబాద్‌లో కవర్లు తయారీ చేసే కంపెనీల నుంచి సరఫరాను కట్టడి చేయాల్సి ఉంది. అప్పుడే ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించవచ్చు.

జూట్, క్లాత్ బ్యాగుల తయారీకి ప్రోత్సాహం కరువు

ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్, క్లాత్, పేపర్ బ్యాగుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. అందుకోసం మహిళా సంఘాలకు సబ్సిడీపై బ్యాంక్ రుణాలు ఇప్పించి జ్యూట్, పేపర్ బ్యాగ్‌ల తయారీ యూనిట్లను నెలకొల్పాల్సిన అవసరం ఉంది. పదుల సంఖ్యలో యూనిట్లను ఏర్పాటు చేసి, తయారు చేసిన ఉత్పత్తులు మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. దీంతో వాటిని వినియోగం పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే వ్యాపారుల నుంచి ప్లాస్టిక్ కవర్లు తీసుకోకుండా వినియోగదారుల్లో చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది.

ఫలితం ఇవ్వని తనిఖీలు

ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా సంబంధిత అధికారులు తరుచూ తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నా పెద్దగా ఫలితం ఉండటం లేదు. తనిఖీలు మొక్కుబడిగా సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 360 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను సీజ్ చేశారు. సదరు వ్యాపారులకు రూ.1.88 లక్షల జరిమానా విధించారు. అయితే జరిమానా రూ. 2 వేలు మాత్రమే ఉండటంతో వ్యాపారులు పెద్దగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. పట్టుబడినప్పుడు చూసుకుందాంలే అన్న నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



ప్లాస్టిక్ కవర్లలో తినుబండారాలు



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ పండ్ల దుకాణం వద్ద ప్లాస్టిక్ కవర్‌లో పండ్లను తీసుకెళ్తున్న వ్యక్తి



పేటలో కూరగాయలు ప్లాస్టిక్ కవర్‌లో తీసుకుని వెళ్తున్న గ్రామీణ ప్రాంత వాసులు

పేటలో పండ్ల వ్యాపారి దగ్గర ప్లాస్టిక్ కవర్లు పట్టుకున్న మునిసిపల్ అధికారులు →



కొనసాగుతున్న వరద


జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు ఎగువ నుంచి నీటి రాక

ధరూరు/దోమలపెంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులకు వరద నీటి రాక కొనసాగుతోంది. బుధవారం కర్ణాటకలోని ఆల్మట్టిలో 91.08 టీఎంసీల నీటి నిల్వ ఉండగా 85,537 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 70,780 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. నారాయణపూర్‌లో 30.69 టీఎంసీల నీరు ఉండగా, 69,810 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 69,810 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. జూరాలలో 317.180 మీటర్లలో 7.060 టీఎంసీల నీరు ఉండగా 67 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఐదు గేట్ల ద్వారా 32,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి 31,380 క్యూసెక్కులు వినియోగించి ఐదు యూనిట్ల ద్వారా 79.443 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పాదన చేస్తున్నారు. దీంతో పాటు కాల్వలతో కలిపి మొత్తం 66,317 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు వైపు ఎగువ ప్రాంతం నుంచి 64,030 క్యూసెక్కుల వస్తుండగా 70,883 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 885 అడుగులకు గాను 875.60 అడుగులలో 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 166.3148 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కుడి, ఎడమ గట్ల విద్యుత్ కేంద్రాల ఉత్పాదనతో 63,023 క్యూసెక్కుల నీటిని సాగర్ వదులుతున్నారు.

వీరన్నపేటలో మళ్లీ కనిపించిన చిరుత

- భయాందోళనలో స్థానికులు



వీరన్నపేట సక్కనిరాయిగుట్టపై జంప్ చేస్తున్న చిరుత

మహబూబ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేట ప్రాంతంలో మరో సారి చిరుత పులి కనిపించింది. రెండు రోజుల క్రితం డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం సమీపంలోని సక్కని రాయి గుట్టపై చిరుత కనిపించింది. అదే గుట్టపై బుధవారం చిరుతపులి ఓ రాయిపై నుంచి మరో రాయిపైకి ఎగిరి దూకుతూ స్థానికులకు కనిపించింది. కొందరు దానిని సెల్‌ఫోన్లో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. నివాస ప్రాంతానికి 100 మీటర్ల దూరంలోనే పులి సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ అప్పయ్య, అటవీశాఖ అధికారులు వీరన్నపేటకు చేరుకుని స్థానికులతో సమావేశమయ్యారు. చిరుత దొరికేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ ఒంటరిగా తిరగవద్దని సూచించారు. బోనులు ఏర్పాటు చేస్తామని, చిరుత కనిపించగానే సెల్‌ఫోన్‌లతో చిత్రీకరించే సాహసం చేయొద్దని హెచ్చరించారు.

అదుపు తప్పిన ప్రైవేట్ స్కూల్ బస్సు

బాలానగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న బురదలోకి జారిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలంలోని పెద్దబాయి తండా సమీపంలో ఈ సంఘటన జరిగింది. జడ్చర్ల మండలంలోని ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు బుధవారం ఉదయం తిరుమలగిరికి చెందిన విద్యార్థులను తీసుకెళ్తుండగా, గౌతంపల్లితండా వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న బురదలోకి జారిపోయింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

ఊడిన నట్లు.. ఊగుతున్న లైట్లు



ఇప్పుడో, అప్పుడో కూలేలా ఉన్న హైమాస్ట్ లైట్ స్తంభం

చారకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోకారం గ్రామంలో పదేళ్ల క్రితం హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేశారు. ఐదేళ్ల క్రితమే లైట్లు కాలిపోయాయి. ప్రస్తుతం హైమాస్ట్ లైట్ స్తంభం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. పెదగా గాలి వీచినప్పుడు స్తంభం ఊగుతుంది. స్తంభానికి ఉన్న దిమ్మె నెర్రెలు వారింది. స్తంభం పక్కనుంచి గ్రామస్థులు వ్యవసాయ పొలాలతో పాటు ఇతర పనులకు వెళ్తుంటారు.

ఎన్ని సార్లు అధికారులకు చెప్పినా ఉప యోగం లేదని స్థానికులు చెపుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి శిథిలా వస్థకు చేరిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి దానికి నూతన హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని గ్రామ స్థులు కోరుతున్నారు.

ప్రాజెక్టు ఇక భద్రం

(5వ పేజీ తరువాయి)

గ్రీన్ సిగ్నల్ తెలుపుతూ మంగళవారం పరిపాలన అనుమతులను జారీ చేసింది.

1007 మీటర్ల మేర నిర్మాణం..

ప్రస్తుతం ప్రాథమిక అంచనాల మేరకు వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్ల నుంచి గద్వాల జిల్లా ధరూర్ మండలం రేవులపల్లి మధ్య కృష్ణా నదిపై 1007 మీటర్ల మేర హై లెవల్ రోడ్డు బ్రిడ్జిని నిర్మించనున్నారు. 19 మీటర్ల వెడల్పుతో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. దానికి సంబంధించిన అప్రోచ్ రోడ్డు, లింక్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం కూడా ఇందులో భాగంగానే చేపట్టే అవకాశం ఉంది. నందిమల్లవైపు ఎడమ ప్రధాన కాలువ, సమాంతర కాలువలు ఉన్నాయి. వాటిపై కూడా డీఎల్‌ఆర్‌బీ (డబుల్ లైన్ రోడ్డు బ్రిడ్జి)లను నిర్మించనున్నారు. జెన్‌కో సర్కిల్ నుంచి కుడివైపు హెచ్‌ఎల్‌ఆర్‌బీ (హై లెవల్ రోడ్డు బ్రిడ్జి) వరకు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తారు. ఎడమవైపు నందిమల్ల సర్కిల్‌కు అనుసంధానించడానికి లింక్ రోడ్డు నిర్మిస్తారు. ఈ ఏర్పాటు వల్ల జూరాలపై నుంచి వాహనాల రాకపోకలను నిషేధించవచ్చు. ప్రాజెక్టు నుంచి 12.50 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలైనా కొత్త బ్రిడ్జికి ఇబ్బంది కలగకుండా కాంటూర్ లెవల్స్ 315.130 మీటర్లుగా ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ నుంచి గద్వాల జిల్లాకు వెళ్లాలంటే బీచుపల్లి ఎన్‌హెచ్ 44 బ్రిడ్జి ద్వారానైనా.. లేదా జూరాల ప్రాజెక్టు ద్వారానైనా వెళ్లాల్సి ఉంది. ఈ బ్రిడ్జి నిర్మాణమైతే ఇబ్బందులు చాలావరకు తగ్గుతాయి. అలాగే ప్రాజెక్టు భద్రతకు కూడా ఎలాంటి ముప్పు ఉండదు. పర్యాటకులు వచ్చే సమయంలో భారీ ట్రాఫిక్ జామ్‌లను కూడా నివారించి, ప్రత్యేక ఆకర్షనీయ ప్రదేశంగా రూపొందించవచ్చు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేసి వెంటనే ఇవ్వాలి

- ఎస్ఈ వెంకటరమణ



ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటరమణ

నారాయణపేటటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేసి వెంటనే రైతులకు ఇవ్వాలని ఎస్ఈ వెంకటరమణ సూచించారు. బుధవారం నారాయణపేట జిల్లాలోని శ్యాసన్‌పల్లి రోడ్డు మార్గంలో ఉన్న విద్యుత్ నియంత్రిక సేవ కేంద్రంలో పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతును ఆయన ఏడీఈ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

దామరగిద్ద, ధన్వాడ, కంసాన్‌పల్లి గ్రామాల నుంచి వచ్చిన రైతులతో ఎస్ఈ మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, వాడే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గణేష్‌మార్గ్, సరాఫ్ బజార్ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రానున్న గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరాను ఏవిధంగా తీసుకుంటారో పరిశీలించారు. మండపాలకు నూతన కేబుల్ లైన్‌ను రెండువైపులా ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఏఈ మహేష్‌గౌడ్‌ను ఆదేశించారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం

- వనపర్తి జిల్లావాసులు ఇద్దరి మృతి, పలువురికి గాయాలు
- విహారయాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం



యుగంధర్‌రెడ్డి (ఫైల్)

వనపర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. కారును అతివేగంగా వచ్చిన ఓ లారీ ఢీకొన్న ఘటనలో వనపర్తి జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన రాజవర్ధన్‌రెడ్డి సోదరులైన కిరణ్ కుమార్ రెడ్డి, అశోక్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు తన దగ్గరి బంధువులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఒకే కుటుంబానికి చెందిన దాదాపు 20 మంది ఒక టెంపో ట్రావెల్ బస్సు, ఇన్నోవా కారులో యాత్రకు వెళ్లారు. విహారయాత్ర ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బుధవారం ఉదయం తమిళనాడులోని ధర్మపురి వద్ద వారు వస్తున్న ఇన్నోవా వాహనాన్ని అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలోని ముందు సీటులో ఉన్న రాజవర్ధన్‌రెడ్డి సమీప బంధువు పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన యుగంధర్ రెడ్డి (50), వెనుక సీట్లో కూర్చున్న సునీతమ్మ (70) అక్కడికక్కడే మృతి చెందారు. వారితో పాటు అదే కారు డ్రైవింగ్ చేస్తున్న రాజవర్ధన్‌రెడ్డితో పాటు కారులో ప్రయాణిస్తున్న అతడి భార్య జయ, తల్లి పుష్పమ్మ, ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారందరినీ హుటాహుటిన బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తరలించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే మృతి చెందిన యుగంధర్‌రెడ్డిది పెద్దమందడి మండలం దొడగుంటపల్లి స్వగ్రామం కాగా అతడు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్యశాఖలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. కొన్ని సంవత్సరాలుగా అక్కడే నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు వారు కూడా ఇదే విహార యాత్రలో టెంపో ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్నారు. అప్పటి వరకు వారితో పాటు కలిసి మెలసి ఉన్న వ్యక్తి ఒక్కసారిగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఒక్కసారిగా కన్నీరు మున్నీరయ్యారు. యుగంధర్‌రెడ్డి మృతి వార్తతో అతని స్వగ్రామం దొడగుంటపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి .

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ




తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

పాలమూరు,జూలై 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఎరువులు, విత్తనాల దుకాణాలను బుధవారం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్‌లను పరిశీలించి దుకాణ యజమానులకు సూచనలు చేశారు. స్టాక్‌తోపాటు రైతుల వారిగా యూరియా, సేల్స్ చేయటంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు అమ్మాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ ఉన్నారు.

రిజర్వేషన్లపైనే రాజకీయ భవిష్యత్తు

- పాలమూరు నగరపాలికలో అందరిచూపు వాటిపైనే
- ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ మారుతున్న రాజకీయ సమీకరణలు
- అధికార పార్టీలో చేరనున్న బీఆర్ఎస్ మాజీలు



మహబూబ్‌నగర్ పట్టణం వ్యూ

మహబూబ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పాలమూరు కార్పొరేషన్‌లో ఆశావహులు ఇప్పటి నుంచే డివిజన్లలో పర్యటిస్తున్నారు. కార్పొరేషన్‌లో ఇదివరకు ఉన్న 49 వార్డులు కాస్త 60 డివిజన్‌లుగా మారాయి. వాటి విభజన ప్రక్రియ పూర్తయి, తుది జాబితా వెలువడటంతో పోటీ చేయాలనుకుంటున్న వారు ఎక్క డి నుంచి పోటీ చేయాలి? డివిజన్‌లో ఉన్న అనుకూల పరిస్థితులు ఏంటి? అని లెక్కలు వేసుకుంటున్నా రు. ఇప్పటివరకు బాగానే ఉన్నా డివిజన్ రిజర్వేషన్‌పైనే రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉండటంతో అదే వారిని టెన్షన్ పెట్టిస్తోంది.

రిజర్వేషన్లు ఇలా..

60 వార్డులున్న కార్పొరేషన్‌లో 50 శాతం అంటే 30 స్థానాలు మహిళలకు రిజర్వ్ కానున్నాయి. మహిళా రిజర్వేషన్‌కు ఖరారైన చోట భార్యలు, లేదంటే తల్లులను బరిలో దించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అదే విధంగా మేయర్ పీఠం కోసం చాలామందే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మేయర్ రిజర్వేషన్‌పైనా అందరిలో ఉత్కంఠ నెలకొంది.

మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఇప్పట్లో రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టే అవకాశం లేదు.

ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం వీటికి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అంటే మరో 3-4 నెలల తరువాతే మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

డివిజన్‌లలో మొదలైన క్యాంపెయిన్

ప్రస్తుతం డివిజన్‌ల ప్రక్రియ పూర్తవడంతో ఆశావహులు అవగాహనకు వచ్చినందున ఆయా డివిజన్‌ల ప్రజలతో మాట్లాడుతున్నారు. తాజా మాజీలతో పాటు కొత్తతరం నాయకులు ప్రజలను పలుకరిస్తూ, అవసరాలు, సమస్యలను పరిష్కరించే ప్రయత్నాలు చేస్తున్నారు. డివిజన్‌ల ముఖ్యులతో వాట్సప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి, వీధిలైట్లు, డ్రైనేజీలు, విద్యుత్ తీగల సమస్యలు ఉంటే గ్రూప్‌లో తెలియజేయాలని కోరుతున్నారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదివరకు ఫోన్‌లు ఎత్తని నాయకులు కూడా ఇప్పుడు డివిజన్ ప్రజలు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తున్నారు. చాలామంది ఇప్పటికే కాలనీలలో ఎన్నికల క్యాంపెయిన్ మొదలుపెట్టారు.

మారనున్న రాజకీయ సమీకరణలు

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడం, తొందరలోనే ఎన్నికలు రానున్న నేపథ్యంలో పాలమూరు కార్పొరేషన్‌లో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. అధికార పార్టీలో టికెట్ల మధ్య పోటీ ఎక్కువగా ఉంటుంది. టికెట్ ఖాయమని భరోసా ఇస్తే పార్టీ ఫిరాయింపులకు ప్రతిపక్ష నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్‌కు చెందిన కొందరు తాజామాజీలు, మాజీ కౌన్సిలర్లు అధికార పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. టికెట్ గ్యారెంటీతో పార్టీ మారుతున్నట్లు తెలుస్తోంది. నలుగురు లేదంటే ఐదుగురు మాజీలు ఈనెలలోనే అధికార పార్టీలో చేరనున్నట్లు సమాచారం. అందులో ఇద్దరు తాజామాజీలు కాగా మరో ఇద్దరు గత కౌన్సిల్‌లో కౌన్సిలర్లుగా ప్రాతినిధ్యం వహించిన వారు ఉన్నారు. వీరంతా సీనియర్ నాయకులే కావడం గమనార్హం. ఇప్పటికే వీరంతా అధికార పార్టీ ముఖ్యులతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన మాజీలు మునిసిపల్ చైర్మన్ అవిశ్వాస తీర్మాన సమయంలో పెద్ద ఎత్తున అధికార పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లోనే చాలా మంది ఆయా డివిజన్‌లలో పోటీలో ఉండగా, కొత్తవారి రాకను ఇప్పటికే వ్యతిరేకిస్తున్న క్రమంలో టికెట్ల సర్దుబాటు అధికారపార్టీకి తలనొప్పిగా మారనుంది.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

» సంతానం కలగడం లేదని మనస్తాపం


భువనేశ్వరి (ఫైల్)

అయిజ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : సంతానం కలగడం లేదని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. అయిజ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజకు చెందిన భువనేశ్వరి (23)కి అదే పట్టణానికి చెందిన సమీప బంధువు వెంకటేశ్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. అతడు ఓ ప్రైవేట్ దుకాణంలో గుమాస్తాగా పని చేస్తూ, రాయచూరు చౌరస్తా ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వారికి సంతానం కలుగకపోవడంతో ఆవేదన చెందుతూ ఉండేవారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భువనేశ్వరి మంగళవారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న భర్త తలుపు తట్టగా, ఎంతకూ తెరవలేదు. దీంతో తలుపులను బలవంతంగా తెరిచి లోనికి వెళ్లి చూడగా ఆమె ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే ఆమెను స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతురాలి తండ్రి శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అలంపూర్ చౌరస్తా, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలంపూర్ ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అలంపూరు మండలం, బుక్కాపురం గ్రామానికి చెందిన కె. రంగస్వామి మంగళవారం కర్నూలుకు వెళ్లాడు. రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా అలంపూరు చౌరస్తా దాటిన తర్వాత వైన్‌షాప్ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కర్నూలు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సంఘటనపై భార్య సుజాత ఫిర్యాదు మేరకు బొలెరో వాహనం డ్రైవర్ నరేశ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఊట్కూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని ఎడవెల్లి గ్రామంలో ఓ మహిళ అదృశ్యం అయ్యింది. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శానసోల్ల సుజాత (32) గత 30న ఉదయం పొలానికి వెళ్లింది. 11 గంటల సమయంలో ఆమె భర్త ఆంజనేయులు పొలానికి వెళ్లగా ఆమె కనిపించలేదు. చుట్టుపక్కల రైతులను విచారించగా తెలియదని చెప్పారు. దీంతో ఆయన ఇంటికి చేరుకొని చుట్టుపక్కల వారిని విచారించినా ఫలితం లేకపోయింది. రెండు రోజుల పాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెంజ్ టిప్పర్ బోల్తా


బోల్తాపడిన బెంజ్ టిప్పర్

కోయిలకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండల కేంద్రంలో బుధవారం ఓ బెంజ్ టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. మహబూబ్‌నగర్ నుంచి వింజమూరు వైపు వెళ్తున్న టిప్పర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న తప్పించబోయి కల్వర్టును ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన డ్రైవర్ వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. అతడు బాగా తాగి ఉన్నాడని, వాహనాన్ని అతి వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

రెండు స్కూటీలను ఢీకొన్న బైక్

» ఒకరికి తీవ్ర గాయాలు

» నాగర్‌కర్నూల్ పట్టణంలో ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : రెండు బైకులు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మరొకరు స్వల్పంగా గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని కార్వంగ గ్రామానికి చెందిన కురుమయ్య బుధవారం ద్విచక్రవాహనంపై జిల్లా కేంద్రానికి వచ్చాడు. సాయంత్రం రాంనగర్ కాలనీలో అదుపుతప్పి, ఎదురుగా వస్తున్న రెండు స్కూటీలను ఢీకొన్నాడు. ప్రమాదంలో కురుమయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108కు ఫోన్ చేశారు. అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

ఊర్కొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందినది. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట శివారులో బుధవారం ఈ సంఘటన జరిగింది. కల్వకుర్తి మండలంలోని జిల్లెళ్ల గ్రామానికి చెందిన రైతు చిక్కొండ శివ బుధవారం పశువులను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. అందులోని ఓ ఆవు మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా, విద్యుత్ తీగలకు తగిలి కరెంట్ షాక్ కొట్టి చనిపోయింది. దాని విలువ దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

రాచాలలో మేకపోతు..


విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్‌తో మేకపోతు మృతి

మూసాపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అడ్డాకుల మండలం రాచాల గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ మేకపోతు చనిపోయింది. మేకపోతే మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో కరెంట్ షాక్‌కు గురైందని యజమాని పిల్లి శ్రీను తెలిపారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎర్తింగ్ సరిగా లేకపోవడం వల్లే సంఘటన జరిగిందని తెలిపాడు.

రిజర్వేషన్లపై చర్చల జోరు

» హైకోర్టు ఆదేశాలతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం

» ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశావహుల ఎదురుచూపులు

» రంగం సిద్ధం చేసుకుంటున్న ప్రధాన పార్టీలు

» ఇప్పటికే నియోజకవర్గ స్థాయి సమావేశాలు పూర్తి


శాంతినగర్‌లో అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్ (ఫైల్)

అయిజ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో 14 నెలలుగా కొనసాగుతున్న ప్రత్యేకాధికారుల పాలనకు త్వరలోనే తెరపడనున్నది. గత నెల 25న హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ప్రభుత్వం స్థానిక ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఆరు నెలల క్రితమే స్థానిక ఎన్నికల కు కావలసిన సామగ్రిని సమకూర్చడం, ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వడం, ఓటరు జాబితాలు ప్రకటించడం తదితర ఎన్నికల పనులను జిల్లా అధికారులు పూర్తి చేశారు. దీంతో ప్రభుత్వ నిర్ణయం, ఎన్నికల సంఘం ప్రకటనే తరువాయి అన్నట్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చోప చర్చలు జరుగుతున్నాయి. ఈనెల 25వ తేదీనాటికి రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసి, సెప్టెంబర్ 30 నాటికి స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రకటించాలని కోర్టు ఆదేశించింది. దీంతో మరో 20 రోజుల్లో రిజర్వేషన్లు వెల్లడవుతాయని ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

మహబూబ్‌నగర్ జిల్లాలో 423 గ్రామ పంచాయతీలున్నాయి. జడ్‌పీటీసీ 16, ఎంపీటీసీ 175 స్థానాలున్నాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లు ఉన్నాయి. మిగతా 3 మునిసిపాలిటీల్లో 49 కౌన్సిలర్ స్థానాలున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో 255 గ్రామపంచాయితీలు ఉండగా, 141 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 13 మండలాలకు గానూ 13 జడ్‌పీటీసీ స్థానాలు ఉంటాయి. గద్వాల, అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ మున్సిపాలిటీల్లో కలిపి మొత్తం 77 కౌన్సిలర్ స్థానాలు ఉన్నాయి. వనపర్తి జిల్లాలో 255 గ్రామపంచాయతీలున్నాయి. ఎంపీటీసీ స్థానాలు 128, జడ్‌పీటీసీ స్థానాలు 14 ఉన్నాయి. మునిసిపాలిటీలు 5 ఉండగా, మొత్తం వార్డులు 80 ఉన్నాయి. నారాయణపేట జిల్లాలో 274 గ్రామ పంచాయతీలున్నాయి. ఎంపీటీసీ 136 జడ్‌పీటీసీ 13 స్థానాలున్నాయి. మునిసిపాలిటీలు 4 ఉండగా, 72 కౌన్సిలర్ స్థానాలున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 461 గ్రామ పంచాయతీలున్నాయి. జడ్‌పీటీసీ 20, ఎంపీటీసీ 210 స్థానాలున్నాయి. 4 మునిసిపాలిటీలు 84 కౌన్సిలర్ స్థానాలున్నాయి.

అయిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 27 శాతం, ఎస్సీలకు 15 శాతం, మరో 6 శాతం ఎస్టీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. గత ఎన్నికలను కూడా ఇవే రిజర్వేషన్ల ప్రకారం నిర్వహించారు.

సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు

స్థానిక సంస్థల ఎన్నికలపై కోర్టు ఆదేశాల నేపథ్యంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో గత నెల 25వ తేదీన అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ శాంతినగర్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సిద్ధమవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదే నెల 26న జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో గద్వాల నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామాల్లో చర్చలు మొదలయ్యాయి.


గద్వాల నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు (ఫైల్)

42 శాతంపై ఉత్కంఠ !

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించడంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది. కోర్టు తీర్పుల మేరకు ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించలేదు. కానీ ఇప్పుడు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే, మిగతావి ఎలా ఉండబోతున్నాయో తేలాల్సి ఉంది. గతంలో ఇచ్చిన మొత్తం 48 శాతం రిజర్వేషన్లలో బీసీలకు 42 శాతం ఇస్తే, ఎస్సీ, ఎస్టీలకు తగ్గే అవకాశం ఉంది. ఒక వేళ ఆ రిజర్వేషన్లను అలాగే ఉంచి బీసీలకు 27 శాతానికి అదనంగా 15 శాతం పెంచితే రిజర్వేషన్లు 50 శాతం దాటే అవకాశం ఉంది. ఈ పరిస్థితు ల్లో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నదన్న అంశంపై చర్చలు కొనసాగుతు న్నాయి.

ఆశ, అత్యాశలే నేరగాళ్లకు పెట్టుబడి

» సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ రాజు



సైబర్ నేరాలపై వివరిస్తున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ రాజు

గద్వాల క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఆశ, అత్యాశలే నేరగాళ్ల పెట్టుబడి అని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ రాజు అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తకొత్త మార్గాల్లో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ జాగృతి దివస్‌ను పురస్కరించుకొని బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కొట్టం కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బులు పోయాక బాధపడటం కన్నా, అవగాహనతో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల ప్రజలను మోసం చేస్తున్న విధానాలను విద్యార్థులకు వివరించారు. ప్రస్తుతం పీఎం కిసాన్ యోజన అంటూ వాట్సాప్‌లో ఏపీకే ఫైల్స్‌ను ఫార్వర్డ్ చేస్తున్నారని, ఆ ఫైల్‌ను క్లిక్ చేస్తే ఫోన్ హ్యాక్ అయి డబ్బులు పోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే జంప్‌డ్ డిపాజిట్ స్కీం, డిటిజల్ అరెస్టు, ఇన్వెస్టుమెంట్ ఫ్రాడ్, సైబర్ బుల్లింగ్ తదితరాలను వివరించారు. బ్యాంకు అధికారులు ఫోన్ చేసి ఓటీపీ అడగరనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలంటూ ఏదైనా ప్రభుత్వ శాఖ పేరుతో ఫోన్ చేసి ఓటీపీ అడిగితే ఇవ్వొద్దని చెప్పారు. అదంతా సైబర్ నేరగాళ్ల పనే అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తద్వారా డబ్బు రికవరీ చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో కానిస్టేబుల్ రమేశ్ ఆచారి, గద్వాల టౌన్ సైబర్ వారియర్ బి.రాజు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు భద్రత పాలకులకు పట్టదా?

» బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు

» జూరాల డ్యామ్‌ను పరిశీలించిన నాయకులు


జూరాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

ధరూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టు భద్రతపై పాలకులకు ఏమాత్రమూ చిత్తశుద్ధి లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు విమర్శించారు. డ్యామ్ దుస్థితికి గత ప్రభుత్వాలే కారణమని ఒకరు చెప్తే, ఎలాంటి ముప్పు లేదని మరో నాయకుడు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండలంలోని జూరాల ప్రాజెక్టును బుధవారం ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ర్యాలంపాడు రిజర్వాయర్‌ను వారి హయాంలోనే నిర్మించారన్నారు. ఈ లీకేజీలకు కారణం ఎవరని ప్రశ్నించారు. గట్టు ఎత్తిపోతల పథకం నేటి వరకు ఎందుకు పూర్తి కాలేదో మామ, అల్లుళ్ల సమాధానం చెప్పాలన్నారు. గత పాలకులు నడిగడ్డ అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. రిజర్వాయర్ పరిధిలోని కాలువల నిర్మాణం ఎందుకు పూర్తికాలేదని, ఎన్ని ఎకరాలకు సాగు నీరు పారిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్లను నాసిరకంగా నిర్మించి చెరువులుగా తయారు చేసిన ఘనత గత ప్రభుత్వాలదేనన్నారు. ఈ విషయం ప్రజలకు కూడా తెలుసని చెప్పారు. నెట్టెంపాడు నుంచి నేటికీ నీటిని పారించకపోగా, రెండు లక్షల ఎకరాలకు నీరు పారిస్తామంటూ, ఎన్నికల సమయంలో మామా అల్లుళ్ళ మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టలేదా అని ప్రశ్నించారు.

పాలకులు ఇప్పటికైనా స్పందించాలని, జూరాల డ్యామ్ భద్రతతో పాటు ర్యాలంపాడు, నెట్టెంపాడులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురువ పల్లయ్య, పులికల్ భీమన్న, అయిజ రాజు, శాంతినగర్ రాజు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలో నుంచి రూ. 64 వేలు మాయం

- పీఎం కిసాన్ పేరిట వాట్సాప్‌కు లింకు
- క్లిక్ చేయగానే నగదు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు
- జార్ఖండ్‌లో ఏటీఎం ద్వారా డ్రా చేసినట్లు గుర్తింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు


గట్టులో ఎస్‌ఐ కి ఫిర్యాదు చేస్తున్న భాదితుడు

గట్టు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : పీఎం కిసాన్ పేరిట వాట్సాప్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చయగానే బ్యాంకు ఖాతాలో నుంచి నగదు మాయం అయ్యింది. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టులో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ కేటీ మల్లేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్‌కు పీఎం కిసాన్ పేరిట మూడు రోజుల క్రితం వాట్సాప్‌లో ఓ లింకు వచ్చింది. పథకానికి సంబంధించిన డబ్బు ఖాతాలో జమ అయ్యిందో లేదో తెలుసుకోవాలంటూ మెసేజ్ ఉంది. దీంతో లక్ష్మణ్ ఆ లింక్‌ను క్లిక్ చేశాడు. వెంటనే అతడి పేరున ఉన్న ఎస్‌బీఐ ఖాతాలో నుంచి రూ. 64,500 మాయమయ్యాయి. ఆ వెంటనే అతడి సిమ్ కూడా బ్లాక్ అయ్యింది. విషయాన్ని అలస్యంగా గుర్తించిన బాధితుడు బుధవారం బ్యాంకు అధికారులకు తెలిపాడు. అధికారులు ఖాతాను పరిశీలించి, జార్ఖండ్ రాష్ట్రంలోని ఓ ఏటీఎం ద్వారా ఆ నగదు డ్రా అయినట్లు గుర్తించి అతడికి తెలిపారు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఖాతా వివరాలను సైబర్ టీంకు అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వాట్సాప్ గ్రూప్‌లలో వస్తున్న లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు.

మాడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో డీఈవో

ధన్వాడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలోని మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని డీఈవో గోవిందరాజులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం గురించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఈవో నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

వలసలు ఇంకెంత కాలం?

» ఈనెల 5న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు

» పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్

పాలమూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు కరువు, కాటకాలు, వలసలతో ఇంకెంతకాలం కష్టాలు పడాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాకు జరిగిన అన్యాయాలను తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట సమయంలో ఎత్తి చూపించామని తెలిపారు. తెలంగాణ వచ్చాక మన జిల్లా వనరులను మన జిల్లాకే వినియోగించి ప్రజల కష్టాలు తీర్చకుండా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. కృష్ణ తుంగభద్ర నదుల నీటిని ఎత్తిపోసి, రిజర్వాయర్లను నిర్మించి నీరు నింపడం లేదని, సాగు యోగ్యమైన 40 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించటం లేదని విమర్శించారు. పోరాడి సాధించుకున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను జూరాల నుంచి శ్రీశైలానికి మళ్లించి డిండి - నల్గొండ ప్రాజెక్టుగా మార్చారని ఆరోపించారు. పంట పొలాల మధ్య ఇథనాల్, ఫార్మా పరిశ్రమలను దించి కాలుష్య విషం చిమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి నోచుకోక కృత్రిమ కరువులతో వలసలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీటి సాధన, పరిశ్రమల కాలుష్యం నుంచి రక్షణ, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం కోసం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 5న శనివారం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేధావులు, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులతో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యాశాఖ కమిషన్ చైర్మన్ రాక

» పీయూ రిజిస్ట్రార్ పూస రమేశ్ బాబు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : పాలయూరు యూనివర్సిటీకి గురువారం తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి వస్తున్నట్లు రిజిస్ట్రార్ పూస రమేశ్ బాబు తెలిపారు. యూనివర్సిటీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలో విద్యావిధానం, అభివృద్ధిపై చర్చించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు పబ్లిక్ హియరింగ్ (ప్రజా విచారణ) ఉంటుందని తెలిపారు. సమావేశానికి గౌరవ అతిథిగా వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ హాజరు కానున్నారని చెప్పారు.

మంత్రి పర్యటనకు ముందే మాట్లాడాను

» బ్రిడ్జి నిర్మాణంతో ముప్పు తప్పుతుందని వివరించా

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

గద్వాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టు పరిశీలనకు ముందే నీటి పారుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడారు. జూరాల ప్రాజెక్టు నిర్వహణ సక్రమంగా లేదని, క్రస్ట్ గేట్లకు మరమ్మతులు అవసరమని మంత్రికి వివరించినట్లు తెలిపారు. గేట్ల రోప్‌లు తెగిపోతే, త్వరగా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు తెలిపారు. భారీ వాహనాల రాకపోకలతో ప్రాజెక్టుకు ముప్పు వాటిల్ల నుందని, మరో బ్రిడ్జి నిర్మాణం అవసరమని ఇదివరకే ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు. వెంటనే మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. అయితే ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా మంజూరు చేయించడం వల్ల బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందో లేదోనన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖ ద్వారా మంజూరు చేయించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోందన్నారు. ఏదిఏమైనా వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

ఇంటర్వ్యూ..

వన మహోత్సవం లక్ష్యం 90 వేల మొక్కలు

- శివశంకర్‌గౌడ్, ఏపీవో, వంగూరు



వంగూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వన మహోత్సవంలో భాగంగా 90 వేల మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఏపీవో శివశంకర్‌గౌడ్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

మండలంలోని ఎన్ని వన నర్సరీలు ఉన్నాయి ? ఏఏ మొక్కలు పెంచుతున్నారు ?

27 వన నర్సరీలలో కానుగు, టేకు తదితర మొక్కలను పెంచుతున్నాం.

మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి ?

మండలంలో మొత్తం 7074 జాబ్ కార్డులున్నాయి. జాబుకార్డు ఉన్న ప్రతీఒక్కరికి పనులు కల్పిస్తున్నాం.

ఏఏ పనులు చేపడుతున్నారు. ?

ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటేందుకు కూలీలతో గుంతలు తీయిస్తున్నాం. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటుతాం. అవి ఏపుగా పెరిగే వరకు రక్షిస్తాం,

బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారా ?

ఏపీవో: పనులు చేసిన వారందరికి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. సాకేంతిక పరమైన కారణాలతో కొంత ఆలస్యం జరుగుతోంది.

ఆసక్తి కనబరుస్తున్న రైతులు

- ఆయిల్ పామ్ సాగుపై కలెక్టర్ బదావత్ సంతోష్



మాధారం శివారులో ఆయిల్ పామ్ మొక్కలు నాటుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఊర్కొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ సాగు చేయడానికి రైతుల ఆసక్తి కనబరుస్తున్నారని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని మాధారం గ్రామానికి చేరుకొని రైతు పొలానికి ట్రాక్టర్‌పై వచ్చిన కలెక్టర్‌కు అధికారులు, రైతులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతు శ్రీకాంత్‌కు చెందిన 10 ఎకరాల పొలంలో 500 ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా మరో రైతు కృష్ణారెడ్డి ఆయిల్ పామ్ మొదటి క్రాప్ కట్టింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ జిల్లా ఆయిల్ పామ్ తోటల సాగుకు అనుకూలంగా ఉందని తెలిపారు. ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కూడా దిగుబడి బాగుంటుందని, గతంలోనే జిల్లాను సందర్శించి ధ్రువీకరించారని అన్నారు. ప్రస్తుతం రైతు పొలంలో నాటిన ఆయిల్ పామ్ గెలలు, రానున్న నాల్గవ సంవత్సరం నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 7వేల ఎకరాల్లో పామ్ పంట సాగు జరిగిందని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి



పాలెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్ రెడ్డి

బిజినేపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల సొంత ఇంటి నిర్మాణం కల కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. మొదటి విడతలో పూర్తిగా ఇళ్లు లేని పేదవారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతున్నామని తెలిపారు. డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, నాయకులు గోవిందు రామకృష్ణ, అవంతి శంకర్, అమృత్‌రెడ్డి, దారెడ్డి హనుమంత్‌రెడ్డి, జయకృష్ణ, చికొండ్ర రాములు, గోవా శేఖర్, సొప్పరి పరశురాములు, వాల్యానాయక్, గోవిందునాయక్, కత్తె ఈశ్వర్, పండ్ల పాషా, రామన్‌గౌడ్, బాలపీరు, వెంకటేష్ గౌడ్, అధికారులు ఉన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ అందజేత

నాగర్‌కర్నూల్ టౌన్ : జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో బిజినేపల్లి మండలానికి చెందిన 44 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ఆత్మహత్య చేసుకున్న ఏడుగురు రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్, కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు



తాడూరు కేజీబీవీ వద్ద రాష్ట్ర చిన్నారుల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

- రాష్ట్ర చిన్నారుల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి

- తాడూరు కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

తాడూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఎంతటి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర చిన్నారుల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల వసతి గృహాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడడం, వారికి అందిస్తున్న భోజన వసతులు ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతీ ఒక్క చిన్నారి విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసు కురావాలని ఆకాంక్షించారు. చిన్నారులకు అండగా ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు అందించే మెనూలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఏ.రమేష్‌కుమార్, చిన్నారుల హక్కుల పరిరక్షణ కమిషన్ అధికారులు తదితరులు ఉన్నారు.

అచ్చంపేట అభివృద్ధికి సహకరించాలి

- ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట అభివృద్ధే లక్ష్యంగా బుధవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం డిప్యూటీ సీఎంతోపాటు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులను ఎమ్మెల్యే కలిశారు. నల్లమల ప్రాంతానికి అరుదైన లక్ష్మీగోవు పశువుల అభివృద్ధికి నల్లమల ప్రాంతంలో వెటర్నరి పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉపముఖ్యమంత్రితో కలిసి ఉమామహేశ్వర ప్రాజెక్టుకు నిధుల విడుదలపై ఇరిగేషన్ అధికారులతో ఉపముఖ్య మంత్రి మాట్లాడారు. నల్లమల అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయా శాఖల మంత్రులను ఎమ్మెల్యే కోరారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నల్లమల నాయకులు



బీజేపీ నూతన అధ్యక్షున్ని కలిసిన నాయకులు

అచ్చంపేటటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావును అచ్చంపేట బీజేపీ నాయకులు మంగ్యానాయక్, పాపిశెట్టి రాములు, భాస్కర్ రెడ్డిలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర నూతన అధ్యక్షుని ఎన్నికతో రాష్ట్రంలో బీజేపీ నాయకుల్లో నూతన ఉత్తేజం వచ్చిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు.

తీగలపల్లి రిజర్వాయర్ కట్టపై బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

కోడేరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తీగలపల్లి రిజర్వాయర్ కట్టపై బీటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. నరసింహ కోరారు. బుధవారం ఆయన విలేకరుల మావేశంలో మాట్లాడారు. కొల్లాపూర్ వయా కోడేరు మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వెళ్తున్న ప్రధాన రహదారి ఏదుల రిజర్వాయర్ తీగలపల్లి శివారులోని రిజర్వాయర్ కట్టపై బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మయ్య, వెంకటయ్య, శివుడు, వెంకటమ్మ పాల్గొన్నారు.

వేసెక్టమీ ఆపరేషన్ విజయవంతం

కందనూలు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో బుధవారం పురుషులకు వేసెక్టమీ ఆపరేషన్ విజయవంతం అయ్యిందని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రఘు తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.హనుమంతురావు మాట్లాడుతూ వేసెక్టమీ ఆపరేషన్ పురుషులు చేసుకోవడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ప్రశాంత్, నర్సింగ్ ఆఫీసర్లు కే.ఆనంద్, పి.శోభారాణి, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జ్ ఆరోగ్య కార్యకర్త టి.యాదగిరి, ఫార్మాసిస్టు కే.గోవర్ధన్, ఆశా కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు లక్ష్యంతో చదువుకోవాలి

- డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీమా సుల్తానా



మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీమా సుల్తానా

కందనూలు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : అమ్మాయిలు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికనుగుణంగా చదివినట్లు అయితే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీమా సుల్తానా అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాగర్‌కర్నూల్ వారి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు జామెట్రీ బాక్సులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మీ తల్లిదండ్రులు ఎంతో శ్రమపడి మిమ్మల్ని చదివిస్తున్నారని, వారి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే.రవికాంతారావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ శ్రీరామ్ ఆర్య, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ రాకేశ్‌వర్మ, జీహెచ్ఎం భాస్కర్‌రెడ్డి, జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యావన శాఖ అధికారి వెంకటేశం, తహసీల్దార్ యూసఫ్ అలీ, ఎంపీడీవో కృష్ణయ్య, హెచ్‌వో మహేశ్వరి, క్లస్టర్ అధికారి మహేష్, మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్‌రెడ్డి, నాయకులు సమి, వీరారెడ్డి, రైతులు శ్రీనివాస్, గణేష్, మనోహర్‌రెడ్డి, మధురెడ్డి ఉన్నారు.

న్యూస్ బాక్స్

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

- డీఎస్పీ వెంకట్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

వంగూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ఓర్పు, సహనంతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం వంగూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కేసులకు సంబంధించిన రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. సిబ్బంది ఆరోగ్య, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కేసుల ఛేదనలో పూర్తిగా దర్యాప్తు జరపాలని ఎస్ఐ మహేష్‌గౌడ్‌కు ఆదేశించారు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

ఉప్పునుంతల, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్లూరు, వెల్టూరు తండా, ఈర్వట్‌వానిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాల ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రమేష్ పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలి : డీవైఎఫ్ఐ

తాడూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో ప్రకృతి పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎన్నుపోతుల కుర్మయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి 5వ తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో అనేక నగరాల్లో వాయు కాలుష్యం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో దేశ పౌరులందరూ కాలుష్య నివారణలో బాధ్యతగా కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఈశ్వర్, సత్యం, శ్రీధర్, నాయకులు శేఖర్, శివ, శివ పాల్గొన్నారు.

చారకొండ ఎంపీవోగా నారాయణ



చారకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చారకొండ ఎంపీవోగా నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీవో వెంకటేష్ బదిలీపై ఉప్పునుంతల ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు. ఉప్పునుంతలలో పనిచేస్తున్న ఎంపీవో నారాయణ చారకొండకు బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఎంపీవో పేర్కొన్నారు.

రేపు పోలీస్ డ్యూటీ మీట్

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాత పోలీస్ హెడ్ క్వార్టర్లు, కొత్త హెడ్ క్వార్టర్లలో డ్యూటీ మీట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు బుధవారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పోలీస్ అధికారులు హాజరవుతారని ఆయన తెలిపారు. క్రైమ్ ఇన్వెస్టిగేషన్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫింగర్ ప్రింట్స్ క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, అబ్జర్వేషన్ టెస్ట్ డాగ్స్ కార్డు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ కల్కోట

వెల్దండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు పేట్రేగిపోతున్న సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ కల్కోట అన్నారు. బుధవారం మండలంలోని గుండాల సమీపంలోని ఏకలవ్య పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు తమ వ్యక్తిగత వివరాలను అడిగితే చెప్పొద్దని అన్నారు. సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో స్నేహం చేయరాదని పేర్కొన్నారు. ఫేస్‌బుక్ ప్రొఫైల్ లాక్ చేసి ఉంచాలని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైబర్ క్రైం పట్ల అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్, ఏఎస్ఐ జాకీబుల్లా పాల్గొన్నారు.

జర్నలిస్టుల దీక్షలకు మద్దతుగా సంతకాల సేకరణ

కొల్లాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ, మండలాల జర్నలిస్టులకు ప్రభుత్వపరంగా నివాస స్థలాలు ఇవ్వాలని కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్ణయించుకున్న తీర్మానాలలో భాగంగా బుధవారం సంతకాల సేకరణ కార్యక్ర మం నిర్వహించారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం పట్ల దీక్షలకు సంఘీభావంగా సంతకాలు చేసి ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, పార్టీల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి జర్నలిస్టుల న్యాయమైన కోరికలను నెరవేర్చాలని కోరుతూ సంతకాలు చేశారు. ప్రజా సమస్యలను వెలికితీసే జర్నలిస్టులు సొంత ఇళ్లకు నోచుకోని దుర్భర పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. 8వరోజు దీక్షలు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటి కొండ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు రామచందర్, నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి, సీనియర్ జర్నలిస్టులు బచ్చలకూర కురుమయ్య, సీపీ నాయుడు, గోవిందు, కేశవులు, జల్లాపూర్ సురేందర్, మల్లేష్, రామకృష్ణ, తరుణ్, స్వాములు, రాము తదితరులు పాల్గొన్నారు.

5న సాగునీటి సదస్సు

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీటి రంగంలో జరగనున్న అన్యాయంపై ఈ నెల 5న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని వేదిక జిల్లా ఇన్‌చార్జి జె.విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పూలే, అంబేద్కర్ అధ్యయన వేదిక కన్వీనర్ గుడిపల్లి నిరంజన్, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎదిరేపల్లి కాశన్న, నరసింహ, కళ్యాణ్, చంద్రమౌళి, సురేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

చారకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేల వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండపల్లి బాలస్వామి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 9న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న దేశవ్యాప్త సమ్మె నోటీసును పంచాయతీ కార్మిక యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఇసాక్ హుసేన్‌కు అందజేశారు.

ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేత

బల్మూరు : కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌నాయక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ అధికారి జెట్టి రాఘవులుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు నిరంజన్, మండల ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు, కార్మికులు వంశీ, ముస్తఫా, బాలమ్మ, చిట్టెమ్మ, శాంతమ్మ, కాశీం, శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

ఊర్కొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాల్వ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపీ నాయక్ తండ్రి రాగూర్ నాయక్ మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్‌రెడ్డి, ఆలయం చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ, నాయకులు ఆయూబ్, పాషా, ఆరిఫ్, మనోహర్‌రెడ్డి, మధురెడ్డి, కొండల్ ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

- ఎంపీడీవో మధుసూదన్ గౌడ్

అచ్చంపేటటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో మధుసూదన్ గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025లో భాగంగా గ్రామాలలో పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలం కావడంతో ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లింగయ్య, ఎంఈవో జీవన్ కుమార్, పీహెచ్‌సీ వైద్యులు శివశంకర్, ఏసీడీపీవో కమల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

● తాడూరు : వర్షాకాలంలో దోమల బెడద కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుందని, వైద్య సిబ్బంది ప్రతీనిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో, ఏపీవో, ఏపీఎం, పీఆర్ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మెడికల్ ఆఫీసర్, అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

● కల్వకుర్తి : పారిశుధ్య నిర్వహణలో ప్రజలు భాగస్వాములు కావాలని కల్వకుర్తి ఎంపీడీవో ఎస్ వెంకట్రాములు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం ఎంపీడీవో ఎస్.వెంకట్రాములు నిర్వహించారు. గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

● చారకొండ : ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేష్, మండల వైద్యాధికారి మంజుభార్గవి, ఎంఈవో ఝాన్సీరాణి, పీఆర్ ఏఈ దివ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రశీదునిసా, ఈసీ రవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట : వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతపై చర్యలు చేపట్టాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల అధ్యక్షులు, ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందితో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. గ్రామాలల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆమె సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025కు సంబంధించి డైరెక్ట్ అబ్జర్వేషన్ టీం గ్రామాలను సందర్శించి పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తుందని తెలిపారు. తహసీల్దార్ రామకృష్ణయ్య, వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, ఏపీఎం రాములునాయక్, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ శెట్టి, ఏఈపీఆర్ శ్రీశైలం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కల్వకుర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణానికి చెందిన నిరుపేద ముస్లిం మైనార్టీ కుటుంబానికి చెందిన తాజ్ అకస్మాత్తుగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని సమకూర్చారు. బీఆర్ఎస్ నాయకులు, ట్రస్టు సభ్యులు బుధవారం పరామర్శించి, కొంత ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి మునిసిపల్ అధ్యక్షుడు బావండ్ల మధు, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు ధారమోని గణేష్, ఉప్పల వెంకటేశ్, మిత్రమండలి అధ్యక్షుడు టిప్పు సుల్తాన్, మైనార్టీ నాయకులు మక్బూల్, శేఖర్, గోరే పాల్గొన్నారు.

మారేపల్లిలో పరామర్శ

తిమ్మాజిపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన బుర్ర కనకయ్య భార్య మల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు నేరేళ్లపల్లి మనోధర్‌అన్నమ్మ దంపతులు, అదేవిధంగా దోమ వెంకటేశ్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

కోడేరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదామని జిల్లా డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షులు బి.రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడుదామని అన్నారు. నాయకులు చంద్రశేఖర్, రాజేష్, ప్రశాంత్ ఉన్నారు.

బీఎల్‌వోల శిక్షణను విజయవంతం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కల్వకుర్తి ఆర్డీవో ఎస్ శ్రీను, మండలాల తహసీల్దార్లు, అధికారులు

- కల్వకుర్తి ఆర్డీవో శ్రీను

కల్వకుర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను తెలిపారు. బీఎల్‌వోల శిక్షణ విజయవంతమయ్యేలా చూడాలని ఆయన కోరారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బీఎల్‌వోల శిక్షణపై ఆర్డీవోలకు, తహసీల్దార్లకు బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కల్వకుర్తి మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, కల్వకుర్తి నియోజకవర్గంలోని కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, వెల్దండ తహసీల్దార్ కార్తీక్, చారకొండ తహసీల్దార్ సునీత, ఆమనగల్ తహసీల్దార్ లలిత, కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్, మాడ్గుల తహసీల్దార్ వినయ్, డీటీలు అనిత, రాఘవేందర్, కిరణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.